సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 19 । ఆగస్టు । 2024



మరో రెండు కొత్త గనులు

సింగరేణిలో వెంకటేష్ ఖని(వీకే)–7, రొంపేడు ఓసీలకు మొదటి దశ పర్యావరణ అనుమతులు లభించే అవకాశముంది. 10లో



జ్ఞాపకాలు పరిచిన చిత్రం

ఓ ఫొటో గతం తాలూకు జ్ఞాపకాలను సజీవంగా మన కళ్లముందు ఉంచుతుంది. మధురస్మృతులను గుర్తు చేస్తుంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 34° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. ఆ తర్వాత ఒకటి, రెండు చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు విశేష పూజలు నిర్వహించగా, భక్తులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన తొండపు విజయ భాస్కర్, శ్వేత దంపతులు రూ.5,116 విరాళం అందజేశారని ఈఓ రజనీకుమారి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో రేపు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు ములకలపల్లి మండలం మంగోపేట గ్రామానికి చేరుకుంటారు. అక్కడ పీహెచ్‌సీని ప్రారంభించిన తర్వాత ఒంటిగంటకు అశ్వారావుపేట మండలం నారాయణపురంలో, 2గంటలకు వినాయకపురంలో గ్రామపంచాయతీ కార్యాలయాలను ప్రారంభిస్తారు. 3 గంటలకు అశ్వారావుపేటలో జిల్లాస్థాయి అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని తన నివాసానికి చేరుకుంటారు. ఈ మేరకు ఆదివారం షెడ్యూల్ విడుదలైంది.

ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ

భద్రాచలంటౌన్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ పేర్కొన్నారు. సోమవారం రాఖీ పండుగను పురస్కరించుకుని ఆయన ఏజెన్సీలోని ఆదివాసీలకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో ఆరు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఆరు పతకాలను సాధించారు. ఈమేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహీధర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18వ తేదీలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. భద్రాచలానికి చెందిన వర్స రాజు 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, పాల్వంచకు చెందిన మహేశ్వరి జావెలిన్ త్రోలో బంగారు పతకం, రుద్రంపూర్‌కు చెందిన పీ.ఎస్. అభిలాష్ 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, పాల్వంచకు చెందిన పి.శృతి ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, పి.హర్షిత జావెలిన్ త్రోలో రజత పతకం సాధించారు. విజేతలను, కోచ్‌లు. పి.నాగేందర్, శివ, ఎం.శ్రీనివాస్లను, పీడీ శ్వేతను జిల్లా క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి, అసోసియేషన్ బాధ్యులు కె. సారంగపాణి, పి.వెంకటేశ్వర్ రెడ్డి, గొట్టిపు రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

బీసీల వాటా కోసం ఉద్యమించాలి

ఖమ్మంమామిళ్లగూడెం : కుల గణన, బీసీ రిజర్వేషన్ల సాధనకు దళిత, బహుజన జాతులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య పిలుపునిచ్చారు. గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ ఆధ్వర్యంలో నగరంలోని ఎంఎస్ కన్వర్షన్ హాల్‌లో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా బీసీల రిజర్వేషన్‌పై జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో బహుజన ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సదస్సులో సూర్యప్రకాశరావు, రామారావు, నాయకులు రాంబాబు, పర్వతాలు పాల్గొన్నారు.

అనురాగ వేడుక.. రాఖీ పండుగ



పాల్వంచలో రాఖీ దుకాణం వద్ద సందడి

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనురాగాల వేడుక రాఖీ పండగను నేడు జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. రెండు, మూడు రోజులుగా రాఖీ దుకాణాలు, స్వీట్ షాపులు సందడిగా మారాయి. విభిన్నమైన రాఖీలతో మార్కెట్‌లు కళకళలాడుతున్నాయి. కొనుగోళ్ల గిరాకీ సంతరించుకున్నాయి.

9లో



ఆకట్టుకుంటున్న రాఖీలు

శిథిలాల్లో చదివేదెలా?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఎప్పుడు కూలుతాయో తెలియక విద్యార్థులు, అధ్యాపకులు క్షణక్షణం భయం భయంగా గడుపుతున్నారు. ఇక వర్షం వస్తే గోడలకు చెమ్మపట్టి మరింత దెబ్బతింటున్నాయి. నిర్వహణలేక మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి.

– కొత్తగూడెంఅర్బన్

కూలిపోయే స్థితికి చేరిన జూనియర్ కళాశాలల భవనాలు

- తరగతి గదులు, స్టాఫ్ రూం గోడలకు పగుళ్లు
- వర్షాలకు చెమ్మ పట్టడంతో భయాందోళన
- నూతన నిర్మాణాల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం



కొత్తగూడెంలో శిథిలావస్థలో జూనియర్ కళాశాల గదులు

జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, వాటిలో కొత్తగూడెం, టేకులపల్లి, పినపాక, బూర్గంపాడు తదితర కళాశాలల భవనాలు మరీ అధ్వానంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి మొత్తం 900 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతోపాటు ఒకేషనల్, పారామెడికల్ కోర్సులు బోధించే తరగతి గదుల పరిస్థితి భయంకరంగా ఉంది. పైకప్పునకు పాకురు పట్టింది. పైన పిచ్చి మొక్కలు మొలిచాయి. గోడలకు పగుళ్లు వచ్చి, వర్షాలకు తడిచి చెమ్మ పట్టి ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని అధ్యాపకులు సైతం ఆందోళన చెందుతున్నారు. స్టాఫ్ రూమ్‌లు సైతం అదే పరిస్థితిలో ఉండటంతో భయంభయంగా కాలం గడుపుతున్నారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో గేదెలు కళాశాల ఆవరణలోకి ప్రవేశించి అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. ఆకతాయిలు కూడా ఆవరణలోకి ప్రవేశించి ఆగమాగం చేస్తున్నారు.

మరుగుదొడ్లు అధ్వానం..

కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మరుగుదొడ్లు పని చేయడంలేదు. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని కళాశాలల్లో నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. టాయిలెట్స్‌కు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. తద్వారా విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్యం వీడి టాయిలెట్స్ నిర్వహణ సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. పని చేయని మరుగుదొడ్ల స్థానంలో కొత్తవి నిర్మించేలా అధికారులు చొరవ తీసుకోవాలని పేర్కొంటున్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని కళాశాలలకు నూతన భవనాలు, మరుగుదొడ్లు నిర్మించాలని, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి మండల్లాల్లో కళాశాలలు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

కాగితాలకే పరిమితం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు, అధ్యాపకులు ఏళ్లతరబడి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 14 కళాశాలు ఉండగా, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో నూతన కళాశాలలు నిర్మించాలని రెండేళ్ల క్రితం ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించి ప్రతిపాదనలు సైతం తీసుకుంది. కానీ ఇంత వరకు ఆ కళాశాలలకు మోక్షం కలుగలేదు. దీంతో ఆ మండలాల్లోని విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివేందుకు దాదాపు 8 నుంచి 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోవడంలేదు.



ఊడిపోయిన పైకప్పు రేకులు



పగుళ్లు వచ్చిన గోడలు

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల తరగతి గదులు కొన్ని శిథిలావస్థకు చేరాయి. వాటిని వినియోగించడంలేదు. బాగున్న గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి కళాశాలలో టాయిలెట్లు పని చేసేలా చూడాల్సిన బాధ్యత ప్రిన్సిపాళ్లపై ఉంది. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

–హెచ్.వెంకటేశ్వరరావు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాఖీ పండుగను పురస్కరించుకుని సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

బతుకమ్మ కానుకలకు స్వస్తి..?

- ఈసారి మహిళలకు చీరల పంపిణీ లేనట్టే
- ప్రత్యామ్నాయ బహుమతులపై ప్రభుత్వ యోచన!



బతుకమ్మ చీరలు(ఫైల్)

చుంచుపల్లి: బతుకమ్మ పండుగకు మహిళలకు అందించే చీరలకు ప్రభుత్వం ఈసారి స్వస్తి పలికినట్లేనని తెలుస్తోంది. తెలంగాణ ఏర్పడ్డాక ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏడాది అక్టోబర్‌లో పంపిణీ చేస్తుండగా, రెండు నెలల ముందు నుంచే లబ్ధిదారుల సంఖ్య, చీరల కొనుగోలు ప్రక్రియపై కసరత్తు జరిగేది. కానీ ఈసారి బతుకమ్మ చీరలకు సంబంధించి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. చీరల స్థానంలో ప్రత్యామ్నాయంగా నగదు లేదా ఇంకేమైనా బహుమతులు అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులో పేరు ఉండి 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017 నుంచి బతుకమ్మ కానుకగా చీరలను అందించింది. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించి, ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవులతో పాటు అన్ని కులాలు, అన్ని మతాలవారికి చీరలు పంపిణీ చేసింది. సిరిసిల్ల, షాద్‌నగర్, నారాయణపేట్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో తయారైన చేనేత చీరలను కొనుగోలు చేసి అందించింది. జిల్లాలో 22 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలలోని 3,66,088 మంది మహిళలకు రేషన్ షాపులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల ద్వారా ఈ బతుకమ్మ కానుకలు నేరుగా అందించేవారు. అయితే ఈ బతుకమ్మ చీరలు నాణ్యమైనవి కాదని, కొనుగోలు ప్రక్రియలో అవినీతి జరిగిందని గతంలో కాంగ్రెస్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అలాంటి నాణ్యతలేని చీరలను పంపిణీ చేసి అభాసుపాలు కాకుండా చీరలకు బదులు వేరే బహుమతులు ఇవ్వాలనే భావనలో ప్రస్తుత ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ జితేష్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి అనుసరణీయమని పేర్కొన్నారు. మహనీయుల త్యాగనిరతి నేటి తరాలకు తెలిసేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహిస్తోందని తెలిపారు. అన్యాయాన్ని ఎదిరించేందుకు పాపన్న గౌడ్ అసామాన్య తెగువ చూపారని కొనియాడారు. మొఘల్ రాజుల కాలంలో దౌర్జన్యాలు, అణచివేతలకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించారని, ఆయన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కులవృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకించారని పేర్కొన్నారు. సమాజంలో అందరూ సమానులేననే భావన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ద్వారా తాటి చెట్లు నాటడం, మహిళా శక్తి సంఘాల ద్వారా తాటి బెల్లం తయారీ, విక్రయాలను ప్రోత్సహించాలని సూచించారు. కాటమయ్య రక్ష పథకం ద్వారా గౌడ కులస్తులకు రక్షణ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ గన్యా, బండి రాజుగౌడ్, అందెం గంగరాజు, కె.గౌతం, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ జె.రమేష్, పాసిని వెంకన్న గౌడ్, బి రవిగౌడ్, ఇజ్జగాని రవిగౌడ్, కొదుమూరి సత్యనారాయణ, బొర్రా జయమ్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార శాఖలో బదిలీలు

9 మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్లతోపాటు పలువురికి స్థానచలనం



ఖమ్మం వ్యవసాయం: జిల్లా సహకార శాఖలో వివిధ హోదాల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉదయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఆరుగురు సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు జూనియర్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పించారు. వరంగల్ సహకార ట్రిబ్యునల్ కోర్టులో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అవధానుల శ్రీనివాస్‌ను ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డీఆర్‌ఓఎస్‌డీగా బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు ఈనెల 20వ తేదీ నాటికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

అధికారుల బదిలీల వివరాలిలా ఉన్నాయి.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
అసిస్టెంట్ రిజిస్ట్రార్లు..		
జి.ఉషశ్రీ	మధిర	ఖమ్మం
ప్రసాద్	తల్లాడ	హైదరాబాద్
సుబ్బారావు	కొత్తగూడెం	ముదిగొండ
శ్రీనివాసకుమార్	కొత్తగూడెం	వైరా
కె. శ్రీనివాస్	కొత్తగూడెం	కారేపల్లి
కె. కిషోర్	కొత్తగూడెం	బోనకల్
కె. సందీప్	వైరా	చింతకాని
వెంకటేశ్వర్లు	ముదిగొండ	ఖమ్మం
ఎం. శ్వేత	మణుగూరు	ఖమ్మం
సీనియర్ ఇన్‌స్పెక్టర్లు..		
శ్రీధర్	ఖమ్మం	బోనకల్
అనంతలక్ష్మి	కూసుమంచి	ఖమ్మం
జగదీష్	బోనకల్	చింతకాని
వరుణ్	కల్లూరు	కొత్తగూడెం
మౌలానా	వేంసూరు	కల్లూరు
విశ్వజిత్	చింతకాని	వేంసూరు
జూనియర్ ఇన్‌స్పెక్టర్లు		
నరేష్	మణుగూరు	ఖమ్మం
నాగేశ్వరి	ఖమ్మం	తల్లాడ
అఖిల	ముదిగొండ	ఖమ్మం
రవి	సత్తుపల్లి	వేంసూరు

అంతా మా ఇష్టం!



మధిరలోని గిరిజన బాలికల వసతిగృహం

- ఉద్యోగ కేంద్రాల్లో ఉండని హాస్టళ్ల వార్డెన్లు
- ఎక్కువ మంది ఖమ్మంలోనే మకాం
- అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలు
- ఫలితంగా గాడి తప్పుతున్న హాస్టళ్ల నిర్వహణ

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ శాఖల వసతి గృహాల్లో సంక్షేమం కొరవడుతోంది. సంక్షేమాధికారులు స్థానికంగా ఉండకపోవడంతో దీంతో వసతిగృహాల్లో పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి. విద్యార్థులపై పర్యవేక్షణ కరువవుతోంది. ఇక కొందరు రెగ్యులర్ సంక్షేమాధికారులకు దూర ప్రాంతాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా.. అసలే జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగించే వారు ఎప్పుడు ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

పని ఓ చోట.. ఉండేది మరోచోట..

ఖమ్మం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ ఆశ్రమ హాస్టళ్లు మొత్తం 114 ఉన్నాయి. హాస్టళ్ల వార్డెన్లు కేటాయించిన వసతిగృహాల ప్రాంతం(హెడ్‌క్వార్టర్స్)లోనే నివాసం ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. వసతిగృహానికి కనీసం ఐదు కి.మీ. పరిధిలోనే నివాసం ఉండాలి. అయితే జిల్లాలో ఎక్కువ మంది అధికారులు ఖమ్మంలోనే ఉంటూ 40 – 50 కిలోమీటర్లకు పైగా దూరమున్న వసతిగృహాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అక్కడ ప్రైవేట్ వర్కర్లను నియమించడం, లేదంటే ఉన్న వర్కర్లలో ఒకరికి బాధ్యత అప్పగించి.. రెండు, మూడు రోజులకోసారి వెళ్లివస్తున్న వారూ ఉన్నారు. దీంతో హాస్టళ్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం సమకూరకపోగా సరైన వసతి సౌకర్యాలు అందడం లేదు. అలాగే పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

అసలే దూరం.. ఆపై ఇన్‌చార్జ్..

పలు సంక్షేమ వసతిగృహాల్లో విధులు నిర్వహించే వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో అధికారులు ఎక్కడికి తనిఖీకి వచ్చినా మరోచోట ఉన్నామని చెప్పుకునే వెసులుబాటు దక్కడంతో ఆడిందే ఆట అన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. చాలాసార్లు ఉన్నతాధికారులు హాస్టళ్లను తనిఖీ చేసినప్పుడు అక్కడి వాతావరణం చూసి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలకు నిలయంగా..

సంక్షేమాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వసతిగృహాల నిర్వహణ గాడి తప్పుతోంది. ఒకరోజు వస్తే మరో రోజు రాకపోవడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందకపోగా సాయంత్రం రీడింగ్ క్లాస్‌ల నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. ఇటీవల అదనపు కలెక్టర్ తల్లాడ, కల్లూరు వసతిగృహాలను సందర్శించగా.. కల్లూరు హాస్టల్ పరిస్థితి చూసి అవాక్కయినట్లు సమాచారం. ఆ సమయంలో వార్డెన్ లేరని తేలింది. సత్తుపల్లి నియోజకవర్గంలోని కిష్టారం బీసీ వసతిగృహం వార్డెన్‌కు కల్లూరు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా ఖమ్మం నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించిన అదనపు కలెక్టర్ ఆయనకు షోకాజ్ నోటీస్ ఇచ్చారని సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లోని వసతిగృహాల్లో విధులు నిర్వర్తించే వార్డెన్లయితే ఉదయం హాస్టళ్లకే వెళ్లకుండా ఖమ్మం పటేల్ స్టేడియంలో వాకింగ్ చేస్తున్నారనే ఛలోక్తులు వారి వాట్సాప్ గ్రూప్‌ల్లో చక్కర్లు కొడుతున్నట్లు తెలిసింది.

80 కి.మీ. ఎలా వెళ్లొస్తారు?

జిల్లాలో వార్డెన్ల కొరత ఉండడంతో పలు వసతిగృహాలకు ఇన్‌చార్జిలను నియమించారు. అయితే ఇన్‌చార్జి బాధ్యతలను సమీపంలోని హాస్టళ్ల వార్డెన్‌కు అప్పగించాలి. కానీ జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి తీరు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నేలకొండపల్లి ఎస్సీ బాలికల వసతిగృహం రెగ్యులర్ వార్డెన్‌కు మధిరలోని గిరిజన బాలికల వసతిగృహం ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆ వార్డెన్ అటు నేలకొండపల్లి, ఇటు మధిరలో ఎప్పుడు విధులు నిర్వర్తిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. నేలకొండపల్లి నుంచి మధిరకు దాదాపు 80 కి.మీ.దూరం ఉంటుంది. అయినా ఇన్‌చార్జ్ ఎలా ఇచ్చారో తెలియకపోగా.. అధికారుల తీరుతో కొందరు వార్డెన్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

క్లుప్తంగా

గంజాయి రవాణా చేస్తే కఠినచర్యలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఏఎస్పీ

భద్రాచలంటౌన్: సరిహద్దు రాష్ట్రాల నుంచి భద్రాచలం మీదుగా గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఆదివారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయికి అలవాటు పడిన వారిలో యువకులే అధికంగా ఉన్నారని, యువత మత్తుకు బానిసలు కాకుండా ఉండాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

అశ్వారావుపేట: మండలంలోని నారంవారిగూడెం స్టేజీ సమీపంలో ఆదివారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నారంవారిగూడెంలోని ఆయిల్‌పాం నర్సరీలో పనిచేస్తున్న చిన్నం ప్రకాష్, సుందరం కారులో అశ్వారావుపేట బయలుదేరారు. కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆయిల్‌పాం గెలలతో రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను వీరి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రకాష్, సుందరంగా గాయపడగా వారిని విజయవాడ తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తగూడెంటౌన్: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం కొత్తగూడెం టూటౌన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాజులరాజంబస్తీకి చెందిన ఆరేపల్లి రాజేశ్వరరావు ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. పని మీద రామవరం బేతానియా చర్చి వద్ద ఉన్న షాపులో బిల్లులు తీసుకుని వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిది మందిపై కేసు

పాల్వంచరూరల్: గతంలో తమపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి చంపుతామని బెదిరించిన తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని తోగ్గూడెంతండా ఒడిశా క్యాంప్‌లో ఈ నెల 12వ తేదీన కేశోత్ గోపి, కేశోత్ శ్రీనుపై మాలోతు భావ్‌సింగ్, భూక్యా హన్మంతు, విష్ణు, విజయరామరాజు, ఈశ్వర్, గుగులోత్ కళ్యాణ్, భూక్యా చిన్ని, గుగులోత్ చిట్టి, మాలోత్ లక్ష్మి కలిసి దాడి చేశారు. దీంతో బాధితుల బంధువు కేశోత్ బాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ ఆదివారం తెలిపారు.

కేసు నమోదు

అశ్వారావుపేట: తండ్రిపై దాడి చేసిన వ్యక్తిపై అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ యాకూబ్ అలీ కథనం ప్రకారం అశ్వారావుపేట బీసీకాలనీకి చెందిన నాయిని వెంకటనారాయణ కుమారుడు చక్రధర్ మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి దూరంగా ఉండాలని తండ్రి మందలించడంతో ఆదివారం తండ్రిపై చక్రధర్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చక్రధర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జగ్యాతండాలో ఇరువర్గాల ఘర్షణ?

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం జగ్యాతండాలో ఇరువర్గాలు ఘర్షణ పడగా పలువురు గాయపడినట్లు సమాచారం. తండాలో ఆదివారం రాత్రి జరుగుతున్న ఓ వేడుక వద్ద డీజే పెట్టే విషయంలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారని తెలిసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. పోలీసులు అక్కడికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మద్యం మత్తులో బిహార్ కార్మికుడి వీరంగం

నేలకొండపల్లి: మండలంలోని ఓ గ్రానైట్ క్వారీలో పనిచేసే బిహార్‌కు చెందిన కార్మికుడు ఆదివారం మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. కూసుమంచి – నేలకొండపల్లి ప్రధాన రహదారిపై వచ్చే వారి మీదకు వెళ్లటం, మద్యం మత్తులో కింద పడుతూ..లేస్తూ.. నానా రభస చేశాడు. కోరట్లగూడెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గంగయ్య రహదారి వెంట పొలాల్లో గొర్రెలను మేపుతుండగా పొలంలోకి వెళ్లి దాడి చేశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు దేహశుద్ధి చేసి, కట్టేశారు. క్వారీ నిర్వాహకులు ఘటనా స్థలానికి చేరుకుని కార్మికుడిని తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కూసుమంచి : మండలంలోని లోక్యాతండాకు చెందిన భూక్యా బుజ్జి (44) ఈనెల 4న గడ్డిమందు తాగగా కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బుజ్జి శనివారం రాత్రి మృతిచెందింది. కాగా, తన తల్లి కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జ్ఞాపకాలు పరిచిన చిత్రం

- చిత్రం చెరిగిపోనిది.. జ్ఞాపకం చెదిరిపోనిది..
- గడిచిన కాలాన్ని కళ్ల ఎదుట నిలిపేవి ఫొటోలు


నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కాలం పరుగెత్తుతోంది.. గడిచిన సమయం ఇక తిరిగి రాదనీ అందరికీ తెలిసిందే.. కానీ, ఆ గతం తాలూకు జ్ఞాపకాలను సజీవంగా మన కళ్లముందు ఉంచేది ఫొటో.. అలాంటి ఫొటోలు మనల్ని ఎన్నో ఏళ్ల వెనుకకు తీసుకెళ్లగలవు.. గత మధురస్మృతులను గుర్తు చేయగలవు.. అలనాటి ఘటనలను నెమరువేయించగలవు.. అంతేకాకుండా ప్రకృతి అందాలను బంధించగలవు.. సుందర దృశ్యాలను ఎల్లకాలం నిలిపిఉంచగలవు.. శుభకార్యాల గుర్తులు, గతించిన మనుషుల రూపాలు, ఇతర ఎన్నో సంఘటలను చిత్రాల రూపంలో తిరిగి చూపించగలవు.. అలా ఫొటోలు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం సెల్ఫీల రూపంలో మన దైనందిన జీవితంలోకి చొరబడ్డాయని కూడా చెప్పవచ్చు. అయితే, ఈ ఫొటోగ్రఫీకి కూడా ఒక రోజు ఉంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కథనం.. – ఇల్లెందురూరల్/కరకగూడెం/భద్రాచలంటౌన్

ఫొటోలు లేని ప్రపంచాన్ని ఊహించలేం. మానవ జీవితంతో ఫొటోలకు విడదీయరాని బంధం ఏర్పడింది. అందమైన దృశ్యాలను చూడాలని అందరికీ అనిపిస్తుంది. మనసుకు ఆహ్లాదాన్ని పంచే సుందర దృశ్యాలను పదేపదే వీక్షించాలంటే వాటిని కెమెరాలో బంధించి ప్రింట్‌ల రూపంలో చూసుకోవచ్చు. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో ఇంటి నుంచి వీక్షించే పరిజ్ఞానం పెంపొందాక ఫొటోగ్రఫీకి మరింత ఆదరణ పెరిగింది. మధుర క్షణాలను ఫొటోల రూపంలో నిక్షిప్తం చేయడం ఎందరికో అలవాటుగా మారింది. కెమెరాల ఆవిష్కరణ నుంచి కాలక్రమేణ ఈ టెక్నాలజీ కూడా ఎంతో అభివృద్ధి చెందుతూ వస్తోంది. ప్రాచీన కాలం నుంచి ఫొటోగ్రఫీ మూలాలు చరిత్రలో ఉన్నాయి. ఓ చక్కని చిత్రాన్ని గీసేందుకు కళాకారుడికి ఎంత సృజనాత్మకత అవసరమో.. ఓ మంచి దృశ్యాన్ని కెమెరాలో బంధించడానికి అంతే అవసరం ఉంటుందని పలువురు చెబుతున్నారు. కంటికి కనిపించని ఎన్నో కమనీయ, సుందర దృశ్యాలను కెమెరామెన్‌లు తమ లెన్స్‌తో చూడగలుగుతారు. కొన్ని చిత్రాలు మదిలో కలకాలం నిలిచిపోతున్నాయంటే అందులోని దృశ్యాలు ఎంతగా ఆకట్టుకుంటున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సూక్ష్మజీవి నుంచి క్రూర మృగం వరకు కెమెరాల్లో బంధీకాని అంశం బహుశా ఈ సృష్టిలో లేదనే చెప్పాలి. కంటికి కనిపించని దృశ్యాలను సైతం నచ్చిన సైజులో చూసుకునే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. చంద్రుడిపైనా, ఇతర కక్ష్యలలోని చిత్రాలను సైతం శాటిలైట్ ద్వారా చిత్రీకరించే స్థాయికి ఫొటోగ్రఫీ ఎదిగింది.



దండగుండాల జలపాతం



సాయంత్రం వేళ చిరుమళ్ల బ్రిడ్జి



ఏజెన్సీ నుంచి జాతీయస్థాయికి..



భద్రాచలం క్లాసిక్ ఫొటో స్టూడియో అధినేత ఎస్కే షరీఫ్.. జాతీయస్థాయిలో అవార్డులు పొందారు. అడవుల్లో, ప్రకృతి ఒడిలో జీవనం సాగిస్తున్న ఆదివాసీల జీవన శైలిని తన కెమెరాలో బంధించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాంధించారు. 2017లో అమెరికాలోని ఇమెజ్‌క్లెగ్ సొసైటీ ఫెలోషిప్ అవార్డులు రెండు అందుకుని అంతర్జాతీయ స్థాయిలో భద్రాద్రి ఖ్యాతిని చాటారు.

కష్టపడితే మంచి భవిష్యత్..



అంకితభావం ఉంటే ఫొటోగ్రఫీ రంగంలో రాణించవచ్చు. దీన్ని ప్రొఫెషన్‌గా తీసుకున్న వారు ఎందరో ప్రత్యేక శిక్షణ తీసుకుని ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఫొటోలు, వీడియోల చిత్రీకరణలో మెళకువలు నేర్చుకుంటే మరింత రాణించవచ్చు. అలా ప్రస్తుతం ఎందరో ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు. – కీసర సుధాకర్‌రెడ్డి, జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఫొటోగ్రాఫర్లకు గుర్తింపునివ్వాలి



మనిషి పుట్టింది మొదలు తనువు చాలించే వరకు ప్రతి దశను భద్రపరిచే ఫొటోగ్రఫీని నేడు చిన్నచూపు చూస్తున్నారు. తరతరాలుగా ఇదే వృత్తితో జీవనం సాగించిన కుటుంబాలు సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో పోటీని తట్టుకోలేక చితికిపోతున్నాయి. అటువంటి వారిని ప్రభుత్వం ఆదరించి ప్రోత్సహించాలి. –ప్రకాష్, ఫొటోగ్రాఫర్, ఇల్లెందు



చిట్టి చేతులతో కొలిమి పనులు చేస్తున్న బాలుడు

సెల్‌ఫోన్లలో అత్యాధునిక కెమెరాలు

గతంలో కెమెరాలు ప్రత్యేకంగా తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతి సెల్‌ఫోన్‌లో కెమెరా అనేది సర్వసాధారణమైంది. పిండి కొద్ది రొట్టె అన్నట్లు స్మార్ట్ ఫోన్లు మార్కెట్‌లోకి వచ్చాక సెల్‌ఫోన్లలో కెమెరాల సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఫొటోగ్రఫీ మీద ఆసక్తి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా కొన్ని సెల్‌ఫోన్ సంస్థలు తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. అవి మల్టీపర్పస్‌గా ఉపయోగపడుతుండటంతో ప్రతి ఒక్కరికీ ఫొటోలు తీయడం అలవాటుగా మారింది. అందులో సంచలన ప్రక్రియగా ఇటీవల కాలంలో సెల్ఫీలు నిలుస్తున్నాయి.



వెన్నెలలో రమణీయంగా కనిపిస్తున్న చెట్టు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పాల్వంచరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో నివాసముంటున్న వ్యాపారి గోపు జయప్రకాశ్‌రెడ్డి, కిరణ్మయి దంపతులు ఇంటికి తాళం వేసి చర్చికి వెళ్లారు. ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తాళం పగలకొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.85 వేల నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని భావించిన జయప్రకాశ్‌రెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

కేటీపీఎస్‌లో కాపర్ వైర్...

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారం నుంచి గత నెలలో కాపర్ వైర్ చోరీకి గురికాగా ఇటీవల వెలుగుచూసింది. కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలోని ఎంసీఆర్ భవన్ పక్కన ఓ స్టోర్ రూంలో భద్రపర్చిన కాపర్‌వైర్‌ను నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు గత నెల 21వ తేదీ నుంచి 23 తేదీల్లో చోరీ చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఈ నెల 5వ తేదీన అధికారులు గుర్తించారు. ఆదివారం సంబంధిత ఏఈ అమీర్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన కాపర్ వైర్ విలువ రూ.75 వేలు ఉంటుందని తెలిపారు. జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

చోరీకి యత్నిస్తూ దొరికిన వ్యక్తి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2 నుంచి కొందరు వ్యక్తులు స్క్రాప్ చోరీ చేసి ఆటోలో తరలిస్తుండగా సెక్యూరిటీ అధికారులు పట్టుకుని మణుగూరు పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం కొండాయిగూడెంనకు చెందిన ముగ్గురు వ్యక్తులు దాదాపు రూ.10 వేల విలువైన సింగరేణి స్క్రాప్ ఐరన్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఐరన్ దుకాణాలకు తరలిస్తున్న క్రమంలో సింగరేణి సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్ దాడి చేసి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు..?

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీకి పాల్పడుతున్న నిందితులను రఘునాథపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవలి కాలంలో వ్యవసాయ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. ఆటోలో మోటార్లను తీసుకెళ్తున్న వారిని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీసులు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారి విచారణలో రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన వారుగా తేలిందని సమాచారం. రఘునాథపాలెం పోలీసులతో కలిసి సంయుక్త విచారణ సాగిస్తున్నారు. నగరంలోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ఆధ్వర్యంలో ఐదుగురు యువకులు ఈ చోరీలకు పాల్పడు తున్నట్లు గుర్తించినట్లు సమాచారం.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం

వైరా: బాల్యంలో తమతో కలిసి చదువుకున్న ఇద్దరు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు ఆదివారం రూ.1.20 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వైరాలోని మధు, ఠాగూర్ పాఠశాల/కళాశాలలో చదువుకున్న 1997 – 98 బ్యాచ్ విద్యార్థులు.. పట్టణానికి చెందిన తల్లపురెడ్డి కొండారెడ్డి కుటుంబానికి రూ.50 వేలు, తకానీ రజనీకాంత్ కుటుంబానికి రూ.30 వేలు, అలాగే మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కోస్తాల గ్రామానికి చెందిన లింగాల ప్రసాద్‌కు రూ. 40 వేల ఆర్థిక సాయాన్ని వైరా ఏసీపీ ఎం.ఏ రహమాన్, వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వర్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఏసీపీ అభినందించారు.



స్నేహితుడి కుటుంబానికి ఏసీపీ చేతులు మీదుగా ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, నందిగామ మనోహర్, సముద్రాల మురళీకృష్ణ, బట్టు నరసింహారావు, సింగు మహేందర్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



మణిరాగ్ రెడ్డి(ఫైల్)

మధిర : ప్రేమ విఫలమైందనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా ఆయన భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. వీరు మధిరలోని సాయినగర్ లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు మణిరాగ్ రెడ్డి(29) హైదరాబాద్ విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తూ బోరబండ సమీపంలోని గాయత్రి నగర్‌లో ఉంటున్నాడు. కాగా, ప్రేమ విఫలమైందనే మనస్తాపంతో ఈనెల 12న రాత్రి 11 గంటల సమయంలో పాయిజన్ తాగాడు. అదే గదిలో ఉంటున్న మిత్రులు గమనించి యశోదా ఆస్పత్రికి తరలించి, శ్రీనివాసరెడ్డికి సమాచారం అందించారు. దీంతో ఆయన హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లగా మణిరాగ్‌రెడ్డి బతికే అవకాశం లేదని వైద్యులు తెలిపారు. దీంతో ఆదివారం మధిరకు తీసుకొస్తుండగానే మణిరాగ్‌రెడ్డి తుదిశ్వాస విడిచాడు. మృతదేహానికి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టమ్ నిర్వహించాక బనిగండ్లపాడుకు తరలించారు. ఈ మేరకు తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదినం

మణుగూరుటౌన్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన నర్రా శేషారత్నం 102వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధురాలితో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో కుమారులు నర్రా జ్యోతి విజయ మోహన్‌రావు, నర్రా సత్యనారాయణ పాల్గొన్నారు.



శేషారత్నంతో కేక్ కట్‌చేయిస్తున్న కుమారులు

తమ్ముడికి రాఖీ కట్టేందుకు వచ్చి..

కారు ఢీకొని మహిళ మృతి

ఖమ్మంక్రైం/కూసుమంచి: తమ్ముడికి రాఖీ కట్టేందుకు వచ్చిన ఓ మహిళ కారు ఢీకొని మరణించిన ఘటన ఖమ్మంలో ఆదివారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం చౌటపల్లికి చెందిన గాజుల మల్లమ్మ (58) ఖానాపురంలో ఉంటున్న తన తమ్ముడు వీరయ్యకు రాఖీ కట్టేందుకు బస్సులో ఖమ్మం వచ్చింది. కొత్త బస్టాండ్ వద్ద దిగి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. మల్లమ్మ ఎగిరి రోడ్డు పక్కన ద్విచక్రవాహనాలపై పడి అక్కడికక్కడే మృతిచెందగా కారులో ఉన్న వ్యక్తి, మరో మహిళ గాయపడ్డారు. వారిని 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. మల్లమ్మ మృతదేహాన్ని చూసి సోదరుడు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలుండగా.. ఆమె భర్త చాలా ఏళ్లకిందట మృతిచెందాడు.



మల్లమ్మ (ఫైల్)

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం

మారిన వస్తువును చూసి షాక్‌కు గురైన వినియోగదారుడు

కారేపల్లి: ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసి ఓ యువకుడు మోసపోయిన ఘటన కారేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఓ ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వివిధ వస్తువులపై ఆఫర్ పెట్టారు. కారేపల్లి స్టేషన్‌బజార్‌కు చెందిన జ్యూయలరీ షాపు యజమాని దసానియా ఉపేందర్‌సింగ్.. రెండు కారు టైర్లు ఒరిజినల్ ప్రైస్ రూ.9,085 కాగా, ఆఫర్ కింద రూ.5,329 అని చూపించడంతో ఆర్డర్ చేశాడు. ఈ నెల 7వ తేదీన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా పేమెంట్ కూడా చేశాడు. ఈ నెల 17వ తేదీన ఆర్డర్ రావడంతో పార్శిల్ ఓపెన్ చేసి చూడగా.. అందులో పంచర్లు అయి ఉన్న పాతటైర్లు దర్శనమిచ్చాయి. అవాక్కయిన వినియోగదారుడు.. లబోదిబోమంటూ యాప్ కేర్‌కు ఫిర్యాదు చేశాడు. కానీ, పాతటైర్లు పంపించిన వారి అడ్రస్ మాత్రం దిలిప్‌కుమార్, సరయిరోడ్డు, బర్తనఎస్తా, ఉత్తర్‌ప్రదేశ్ అని ఉంది.



కారు పాతటైర్లు వచ్చిన దృశ్యం

అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

వైరా: అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్‌డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన బందెల కృష్ణ (45) మున్సిపాలిటీ పరిధిలోని పామాయిల్ తోట సమీపంలో పొలం దున్నుతూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కొన్నేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్న కృష్ణ వైరాలోని పామాయిల్ తోట సమీపంలోని ఒక కౌలు రైతు పొలం దున్నేందుకు ఉదయం 10 గంటల సమయంలో పొలానికి వచ్చి ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్నాడు. సాయంత్రం 6 గంటల తర్వాత కౌలు రైతు భరత్‌మరో వ్యక్తి వచ్చి చూడగా ట్రాక్టర్ పొలంలో అర కిలో మీటర్ దూరంలో ఉండి కృష్ణ విగతజీవిగా పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై అక్కడక్కడా గాయాలు కనబడటంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ టాప్ గేర్‌లో వదిలేసి ఉండటం మృతదేహం బోర్ల పడి ఉండటం వంటివి అనుమానాలకు తావిస్తోంది. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సాయి ఉన్నారు. ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్

రైలుకింద పడి వ్యక్తి...

ఖమ్మంక్రైం: మద్యానికి బానిసై రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్ కథనం ప్రకారం.. పాకబండబజార్‌కు చెందిన గుంజలూరి నరసింహారావు (36) వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన వెంకటగిరిగేట్ వద్ద రైలుకింద పడ్డాడు. అతని వద్ద ఉన్న వివరాల ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అన్నం ట్రస్ట్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు సిబ్బంది సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో చుంచుపల్లి ఎంపీఓ మృతి



సత్యనారాయణ (ఫైల్)

చుంచుపల్లి: చుంచుపల్లి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న గుంటి సత్యనారాయణ (61) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన వచ్చే ఏడాది మార్చిలో ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రి వద్దకు వచ్చి నివాళులర్పించారు. అనంతరం ఎంపీఓ మృతదేహాన్ని ఖమ్మంలోని ఆయన స్వగృహానికి తరలించి అంత్యక్రియలు చేశారు. కాగా, సత్యనారాయణ మూడేళ్లుగా మండలంలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు.

డెంగీతో చిన్నారి...



రిషిత (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన బండ్ల వెంకన్న – కోటమ్మ దంపతుల కుమార్తె తొమ్మిదేళ్ల రిషిత డెంగీ జ్వరం బారిన పడి ఆదివారం మృతి చెందింది. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న చిన్నారి వైద్యం పొందుతున్న క్రమంలో మృతిచెందటంతో స్టేషన్‌బస్తీలో విషాదచాయలు అలుముకున్నాయి.

జ్వరంతో వ్యక్తి..



తాతయ్య (ఫైల్)

చర్ల: మండలంలోని జీపీపల్లిలో ఓ వ్యక్తి జ్వరంతో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పూనెం తాతయ్య (55)కు మూడు రోజుల కిందట జ్వరం సోకడంతో స్థానికంగా వైద్యం చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో భద్రాచలానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ ఒమేగా హాస్పిటల్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-79 6266]

WANTED TEACHERS
■ High School Maths, Shanthi High School, Opposite More Super Market, Sambani Nagar, Khammam. Contact: 9505500355. [M-118 528 2]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/– మాత్రమే
(GST 5% అదనం)

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :

ఖమ్మం	: 9705444182
	9010299957
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

శునకమే సోదరుడు!



దండేపల్లి: చనిపోయిన పెంపుడు కుక్కను అన్నగా భావిస్తూ.. ఏటా సమాధి వద్ద రాఖీలు కడుతూ అభిమానం చాటుకుంటున్నారు ఇద్దరు అక్కా చెల్లెళ్లు. దండేపల్లి మండలం కన్నె పల్లి గ్రామానికి చెందిన మర్రిపెల్లి మల్లయ్య–కమల దంపతులకు 20 ఏళ్ల క్రితం పిల్లల్లేక పోవడంతో ఓ కుక్కను తెచ్చి రాము అని పేరు పెట్టి పెంచుకుంటున్నారు. దాన్ని పెంచుకున్న కొద్ది రోజులకు వారికి ఆడపిల్లలు రమ, రమ్య జన్మించారు. పిల్లలు పుట్టిన కొద్ది రోజులకు కుక్క చనిపోవడంతో తమ పొలం వద్ద సమాధి కట్టించారు. అయితే మల్లయ్య–కమల దంపతుల ఇద్దరు కూతుళ్లు ఆ కుక్కను అన్నయ్య లా భావిస్తారు. ఏటా రాఖీ పౌర్ణమి రోజున పొలం వద్ద ఉన్న కుక్క సమాధి వద్దకు వెళ్లి రాఖీలు కట్టి తమ అభిమానం చాటుకుంటున్నారు.

ఇద్దరిపై శునకాల దాడి



వెంకటేశ్ కాలిని తీవ్రంగా గాయపరిచిన కుక్క

ఇబ్రహీంపట్నం: వేర్వేరు ప్రాంతాల్లో కుక్కలు జరిపిన దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో నివసించే వెంకటేశ్ (45) ఆది వారం ఉదయం పనిమీద బయటికి రాగా.. అకస్మాత్తుగా ఓ శునకం వెనుక నుంచి కాలిని గట్టిగా పట్టి కరిచింది. చేతి వేలిని సైతం కరవడంతో లోతుగా గాయమైంది. తీవ్ర గాయాలతో వెంకటేశ్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. మంచాల మండలం ఆగా పల్లికి చెందిన శ్రీనివాస్ (57)పై ఆ గ్రామంలో కుక్కలు దాడి చేసి కరిచాయి. అతను కూడా ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు.



చేతి వేలికి అయిన గాయం

ఇటీవల రాయపోల్ గ్రామంలో ఓ బాలుడు కుక్క కాటుతో చికిత్స పొందుతూ మృతి చెందడం తెలిసిందే.

డీఎంకే బాటలో బీఆర్ఎస్!

▶ మొదటి పేజీ తరువాయి

పరిమితమైంది. 1991లో కేవలం 2 స్థానాలు, 1984, 2011లో కేవలం 25లోపు అసెంబ్లీ స్థానాల్లోనే గెలుపొందింది. బీఆర్ఎస్ కూడా రాష్ట్రంలో వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి రాగా.. గత ఏడాది ఎన్నికల్లో మాత్రం ఓటమి పాలయ్యింది. దీంతో ఈ విషయంలోనూ డీఎంకేతో పోలిక ఉన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

డీఎంకే సంస్థాగత నిర్మాణం, కార్యకలాపాల పరిశీలన

బీఆర్ఎస్‌ను మరో 50 ఏళ్ల పాటు తెలంగాణ రాజకీయాల్లో ప్రబల శక్తిగా నిలిపేలా బలోపేతం చేస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇటీవల చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో ఆంజనేయ గౌడ్, తుంగ బాలు వంటి యువ నేతలు చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'ను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. డీఎంకేలో సుదీర్ఘకాలంగా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ భారతితో వారు భేటీ అయ్యారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, అనుబంధ విభాగాలైన యువజన, విద్యార్థి, మహిళా విభాగాల పనితీరు, సోషల్ మీడియా వింగ్ కార్యకలాపాలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు తరాలుగా పార్టీతో కేడర్ మమేకమైన తీరు, క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకలాపాలపై ఆరా తీశారు. తిరువల్లువర్, పశ్చిమ చెన్నై జిల్లాల్లోనూ పర్యటించిన బాల్క సుమన్ బృందం తాము పరిశీలించిన అంశాలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

తృణమూల్, బీజేడీ పనితీరుపై కూడా..!

ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పటికీ ఇటీవలి ఎన్నికల్లో పరాజయం పాలైన నేపథ్యంలో.. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన డీఎంకే ఆటుపోట్లను ఎలా అధిగమించిందనే అంశాన్ని అధ్యయనం చేయాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ సీనియర్ నేతల బృందం సెప్టెంబర్‌లో చెన్నైలో పర్యటించనుంది. క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు డీఎంకే సంస్థాగత నిర్మాణంతో పాటు ఇతర అంశాలను వారం రోజుల పాటు ఈ బృందం అధ్యయనం చేయనుంది. అలాగే దేశంలోని మరికొన్ని క్రియాశీల ప్రాంతీయ పార్టీల పనితీరును.. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఒడిశాలో బిజు జనతాదళ్ (బీజేడీ) పనితీరును కేటీ ఆర్ బృందం ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ తర్వాతే సంస్థాగత నిర్మాణంపై దృష్టి

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కసరత్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత నిర్మాణం, శిక్షణ తదితరాలను ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ నాటికి డీఎంకేతో పాటు మరికొన్ని బలమైన ప్రధాన ప్రాంతీయ పార్టీల పనితీరుపై అధ్యయనం పూర్తి చేయాలని, అధ్యయనంలో తేలిన అంశాలను దృష్టిలో ఉంచుకుని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కార్యాచరణకు పదును పెట్టాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది.

కుటుంబ విలువలతోనే సురక్షిత భారత్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

రామంతాపూర్ (హైదరాబాద్): ప్రపంచంలో ఏ దేశంలో లేనివిధంగా రక్షా బంధన్ వంటి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలతోనే భారత్ సురక్ష భారత్‌గా వెలుగుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఉప్పల్ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన రాఖీ పర్వదిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తనకు రాఖీలను కట్టిన మహిళలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రజలు ప్రేమ, సహనంతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి, వనవాసి కల్యాణాశ్రమం ప్రశిక్షణకమిటీ సభ్యుడు కొరివి రామచంద్రయ్య, జాతీయ సాహిత్య పరిషత్ కార్యదర్శి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

దక్షిణ డిస్కంలో భారీగా పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు భారీ స్థాయిలో 2263 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 101, అకౌంట్స్ విభాగంలో 47, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో 2099, పీ అండ్ జీ విభాగంలో 16 మందికి పదోన్నతులు లభించాయి. ఎస్ఈ నుంచి సీఈగా ఇద్దరు, డీఈ నుంచి ఎస్ఈగా 8 మంది, ఏడీఈ నుంచి డీఈగా 30, ఏఈ నుంచి ఏడీఈగా 58 మంది, జేఎల్ఎం నుంచి ఏఎల్ఎంకు 1650 మంది, అకౌంట్స్ విభాగంలో జీఎం నుంచి సీజీఎంగా ఇద్దరు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నుంచి జీఎంగా ఇద్దరు పదోన్నతి పొందారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 8న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించినప్పుడు.. 2017 నుంచి పదోన్నతులు పెండింగ్‌లో ఉండటాన్ని కొందరు అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే. మంత్రి స్పందిస్తూ పదోన్నతులు ఇవ్వాలని ఆదేశించారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించండి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదకు జూడా విన్నపం
- అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేయాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో తెలంగాణలోనూ ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, హాస్టళ్లలో మహిళా వైద్యులు, మెడికోలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జూనియర్ డాక్టర్ల సంఘం(జూడా) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం టీ–జూడా ప్రతినిధి డాక్టర్ చంద్రిక నేతృత్వంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తదితర కళాశాలల మహిళా ప్రతినిధులతో కలసి తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఎస్.శారదకు వినతిపత్రం అందజేశారు. రెసిడెంట్ డాక్టర్లు, మెడికోలు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. వైద్యుల పని ప్రదేశంలో వారి భద్రతాపరమైన సమస్యలపై ప్రధానంగా చర్చించారు. క్యాంపస్ అంతటా సీసీకెమెరాల పర్యవేక్షణ ఉండాలి. అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ యాప్ స్థానిక పోలీస్ స్టేషన్లు లేదా కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేయాలన్నారు. పరిస్థితులను అంచనా వేయడానికి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు ఆకస్మిక తనిఖీలు చేయాలి. క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు జరగాలని కోరారు. ఇక తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ డిమాండ్ల పట్ల చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారని జూడా నేతలు వెల్లడించారు.

రేపు కవిత బెయిల్ పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్‌గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ నెల 12న ఈ పిటిషన్ విచారణకు వచ్చినపుడు దర్యాప్తు సంస్థల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించిన సంగతి తెలిసిందే.



'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో డాక్టర్ ఎంఎస్ గౌడ్, రమణాచారి తదితరులు

ఇది ఓ సాధారణ దంత వైద్యుడి కల

డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, దంతవైద్యరంగంపై ఇది ఒక అద్భుతమైన పుస్తకం అని అభివర్ణించారు. పుస్తక రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ కృషిని ఆయన అభినందించారు. తెలంగాణలోనే కాకుండా దక్షిణ భారతదేశంలో ఆయన అత్యుత్తమ దంత వైద్యుడిగా గుర్తింపును పొందారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ మాట్లాడుతూ, ఇది తన ఆత్మకథ కాదన్నారు. ఈ పుస్తకం ఒక సాధారణ దంత వైద్యుడి కల అని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కాస్మెటిక్ డెంటిస్ట్రీని ప్రవేశపెట్టేందుకు తాను ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ రంగంలో తాను మొట్టమొదటి వైద్యుడినని చెప్పారు. దంత వైద్యం, దంత వైద్య వృత్తికి ప్రాచుర్యం కల్పించడంలో ఏళ్ల శ్రమ దాగి ఉందన్నారు. డెంటిస్ట్‌ను మెడికల్ డాక్టర్‌కు సమానంగా నిలబెట్టడంలో తన లక్ష్యం నెరవేరిందని ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. దంత సమస్యలకు నొప్పి లేకుండా చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. డెంటల్ లేజర్, ఇంట్రా – ఓరల్ కెమెరా, కంప్యూటరైజ్డ్ డెంటల్ వీడియో ఇమేజింగ్ – ఎయిర్ అబ్రాషన్ తదితర హై–టెక్ పరికరాలతో రోగ నిర్ధారణ, చికిత్సను సులభంగా, వేగంగా చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



వృక్షాబంధన్

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతానురాగాలకు రాఖీ పండుగ ప్రతీతి. ఈ స్ఫూర్తిని ప్రకృతికి ఆపాదించి.. జాగ్రత్తగా కాపాడుకోవాలని పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన పలువురు మహిళలు నిరూపిస్తున్నారు. తెలంగాణ మహిళామిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో ఆదివారం వృక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొక్కల ఆకులు, కొమ్మలు, పూలు.. సేకరించి వివిధ ఆకృతుల్లో ఆకట్టుకునేలా రాఖీలు తయారుచేసి పరస్పరం కట్టుకున్నారు. వాటిని మొక్కలు, చెట్లకూ కట్టడం విశేషం. తమతోపాటు అవి ఎదగాలని, వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ (రామగుండం)

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎండోమెంట్ న్యాయవాది



అమ్మవారిని దర్శించుకుంటున్న మంగీలాల్

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని దేవాదాయ శాఖ న్యాయవాది బి.మంగీలాల్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మంగీలాల్‌కు ఈఓ రజనీకుమారి అమ్మవారి శేషవస్త్రప్రసాదాలను అందజేశారు.

జాతీయస్థాయి పోటీల్లో ఖమ్మం క్రీడాకారుడి ప్రతిభ



మెడల్ సాధించిన క్రీడాకారుడు శివ

ఖమ్మంఅర్బన్: హైదరాబాదులో శనివారం జరిగిన ఐసీఎన్(ఐ కంప్లీట్ నాచురల్) జిమ్ ఫిట్నెస్ జాతీయ స్థాయి పోటీల్లో ఖమ్మం నగరానికి చెందిన వి జిమ్ ఫిట్నెస్ సెంటర్ క్రీడాకారుడు ఎం. శివ అద్భుత ప్రతిభ చాటి మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా శివను కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, కోచ్ వినోద్‌కుమార్, ఇందిరా నగర్ బాలగణపతి ఆలయ చైర్మన్ బాజిన్ని వీరయ్య, అనూష తదితరులు అభినందించారు.

మావోయిస్టుల కుట్ర భగ్నం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. బలగాలను లక్ష్యంగా చేసుకొని ప్రధాన రహదారిపై అమర్చిన శక్తివంతమైన మందుపాతరను గుర్తించి పోలీసులు ఆదివారం నిర్వీర్యం చేశారు. బీజాపూర్ జిల్లాలోని చినగెల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రధాన రహదారి వెంట రాకపోకలు సాగించే పోలీసులను మట్టుబెట్టాలనే కుట్రతో మావోయిస్టులు సుమారు 10 కిలోల శక్తివంతమైన మందుపాతరను ఏర్పాటు చేశారు. అయితే ఈ మార్గంలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టగా తొలుత మావోయిస్టులు మందుపాతర అమర్చిన ప్రాంతం నుంచి సుమారు 200 మీటర్ల దూరం వరకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వైర్ కనిపించింది. దీంతో మందుపాతర ఉన్న ప్రాంతాన్ని గుర్తించి బయటకు తీసి నిర్వీర్యం చేయగా.. పోలీసులకు ముప్పు తప్పింది.

మరో రెండు కొత్త గనులు

ఈనెల 28న ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశం

- వీకే–7 ఓసీ, రొంపేడు ఓసీకి మొదటి దశ అనుమతులకు సిద్ధం
- ఆపై రెండు, మూడు నెలల్లో ఉత్పత్తి మొదలయ్యే అవకాశం
- పూర్వ కళ సంతరించుకోనున్న కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జీఎం కార్యాలయం



నిర్మాణం పూర్తయిన ఏరియా వర్క్‌షాప్

సింగరేణి(కొత్తగూడెం): గత మూడేళ్లుగా ఎదురుచూస్తున్న కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్ ఖని(వీకే)–7 ఓపెన్‌కాస్ట్, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓసీకి మొదటి దశ పర్యావరణ అనుమతులు త్వరలోనే లభించే అవకాశముంది. ఇప్పటికే అనుమతి విషయమై కేంద్ర మంత్రిత్వశాఖ తెలిపిన అభ్యంతరాలపై సింగరేణి యాజమాన్యం స్పష్టత ఇచ్చింది. దీంతో ఈనెల 28న ఢిల్లీలో జరిగే ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో అనుమతి జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి స్టేజ్–1 అనుమతులు గతేడాది రావాల్సి ఉన్నా కేంద్ర మంత్రిత్వ శాఖ పెట్టిన షరతులు, ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ బాధ్యులు ఏరియా సందర్శనకు వచ్చినప్పుడు అధికారులు సంతృప్తికరమైన వివరాలు సమర్పించలేదని తెలిసింది. ఇప్పుడు అన్ని అవాంతరాలు దాటేయడంతో మొదటి దశ, ఆ తర్వాత రెండో దశ అనుమతులు సాధించి వచ్చే నవంబర్, డిసెంబర్ నాటికి గనుల్లో బొగ్గు ఉత్పత్తి మొదలయ్యే అవకాశముంది.

అటవీ అనుమతులతోనే జాప్యం

సుమారు 1,114 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 190 మిలియన్ టన్నుల నిక్షేపాలు కలిగిన వీకే–7 ఓసీ జీవితకాలం సుమారు 35 ఏళ్లు ఉందని తెలుస్తోంది. సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించే ఈ గని కోసం 773 హెక్టార్ల అటవీ భూమి అవసరమైంది. ప్రస్తుతం సింగరేణి ఆధీనంలో 341 హెక్టార్ల స్థలం వివిధ కాలనీల రూపంలో ఉండగా, వీరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేసినట్లు తెలుస్తోంది. ఇక ప్రైవేట్ భూమి సమస్య పరిష్కారమైనా అటవీ భూమి అనుమతులు జటిలంగా మారాయి. ఈ నేపథ్యాన ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం ఇచ్చినా అటవీ శాఖ అధికారులు సంతృప్తి చెందలేదని సమాచారం. అయినప్పటికీ ఈనెల 28న జరిగే సమావేశంలో వారికి సరైన నివేదికలు సమర్పించడం ద్వారా అనుమతి సాధిస్తామని సింగరేణి అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, కొత్తగూడెం ఏరియాలోని వీకే–7 భూగర్భగని, జేకే ఓసీ మూతపడడంతో మరి కొంత ప్రాంతాన్ని కలుపుకుని వీకే–7 ఓసీని సిద్ధం చేస్తున్నారు. ఇక ఇల్లెందు ఏరియాలో 21 ఇంక్లెయిన్ భూగర్భ గని మూతపడగా దాని స్థానంలో రొంపేడు ఓసీ ప్రారంభం కానుంది. ఈ గని 901 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది.

ఓబీ టెండర్లు ఖరారు, నిర్మాణాలు సిద్ధం

వీకే–7 ఓసీకి గతేడాదే అనుమతి వస్తుందని భావించిన యాజమాన్యం రెండేళ్ల క్రితం ఓబీ టెండర్లు ఖరారు చేసింది. ఈ పనులను మహారాష్ట్రలోని ఓ కంపెనీ దక్కించుకున్నట్లు సమాచారం. అంతేకాక వీకే ఓసీ విస్తరణ ప్రతిపాదిత స్థలంలో నిర్మాణాలను తొలగించారు. ఆపై కొత్త నిర్మాణాలకు సుమారు రూ.455.40 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.333 కోట్లతో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ), రూ.10 కోట్లతో ఏరియా వర్క్‌షాపు, రూ.80 కోట్లతో రైల్వే సైడింగ్ పనులు, రూ.20 కోట్ల వ్యయంతో హైవే మళ్లింపు పనులతో పాటు జీఎం కార్యాలయం, ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులన్నీ పూర్తికావడంతో ఎప్పుడు ఓసీకి అనుమతి లభించినా అధికారులు సాఫీగా విధులు నిర్వర్తించే అవకాశముంది. అయితే, సీహెచ్‌పీ నిర్మాణానికి మాయాబజార్ ప్రాంత స్థలాన్ని కేటాయించినా ఆర్‌ఆండ్‌ఆర్ పనులు కాకపోవడంతో ఆలస్యం జరుగుతోంది. దీనికి తోడు కాంట్రాక్టర్ నిర్లక్ష్యమూ కారణమని తెలిసింది.



మూతపడిన వీకే – 7 భూగర్భగని

ఏటా 7.5 మిలియన్ టన్నులు

సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో అష్టకష్టాలకోర్చి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా.. ఎలా సాధించగలరనే పశ్న తలెత్తుతోంది. దీంతో భద్రాద్రి జిల్లాలోని రెండు గనులకు అనుమతి సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అడ్వైజరీ కమిటీ స్టేజీ–1, 2 అనుమతులు త్వరగా జారీ చేస్తే రానున్న నాలుగైదు నెలల్లో ఓసీలో హాల్ రోడ్లు, ఇతర పనులు చేపట్టాలని భావిస్తున్నారు. ఇందులో రొంపేడు ఓసీ నుంచి 2.5 మిలియన్ టన్నులు, వీకే–7 నుంచి 5మిలియన్ టన్నులు కలిపి 7.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, కనీసం సగం మేర అయినా సాధించొచ్చని భావిస్తున్నారు. దీనికి తోడు ఒడిశాలోని నైనీలో ఆరు మిలియన్ టన్నులు తోడైతే లక్ష్య సాధన సులువవుతుంది.

అనుమతి వస్తే ఉత్పత్తి పైపైకి..



వీకే–7 గని మూతపడడంతో మూడేళ్లుగా ఏరియాలో ఉత్పత్తి కొంత తగ్గుముఖం పట్టింది. ఈ లోటును జేవీఆర్ ఓసీ పూడుస్తున్నా వీకే–7 భూగర్భ గని, జేకే ఓసీల్లోని 1,400 మంది కార్మికులను సర్దుబాటు చేయడం కష్టమైంది. ఇప్పుడు వీకే–7 ఓసీకి అనుమతులు లభిస్తే ఇలాంటి ఇబ్బందులు తీరిపోతాయి. మరోపక్క అనుమతులు వచ్చేలోగా ఆర్‌సీహెచ్‌పీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తాం. మిగతా కార్యాలయాలన్నీ సిద్ధంగా ఉన్నాయి.

– ఎం.శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

చెరువులకు జలకళ

- 'భక్త రామదాసు'తో 90 శాతం మేర నిండిన చెరువులు
- 60 వేల ఎకరాలకు సాగునీరు



నీటితో కళకళలాడుతున్న బీరోలు పెద్ద చెరువు



చెరువు కింద సాగు చేస్తున్న వరి

కూసుమంచి : పాలేరు నియోజకవర్గ రైతులకు భక్త రామదాసు ఎత్తిపోతల పథకం వరప్రదాయినిగా మారింది. వర్షాలు పుష్కలంగా లేకున్నా.. సాగర్ జలాలు పాలేరు రిజర్వాయర్‌కు చేరుతుండగా ఈ నెల 3న భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సాగునీటిని విడుదల చేసిన సంగతి విదితమే. సాగర్ డ్యామ్‌లో పుష్కలంగా నీరు చేరడంతో పాలేరు రిజర్వాయర్‌కు కొన్ని రోజులుగా నీరు సరఫరా అవుతోంది. భక్త రామదాసు ప్రాజెక్టు నీరు సైతం సరఫరా అవుతుండడంతో నియోజకవర్గంలోని చెరువులన్నీ జలకళ సంతరించుకుంటున్నాయి. దీంతో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుందనే భరోసా రైతుల్లో కలుగుతోంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 60 వేల ఎకరాలకు సాగునీరు అందుతుండగా మరో 10 వేల ఎకరాలకు అందాల్సి ఉంది.

90 శాతం మేర చెరువుల్లోకి నీరు..

పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో గల అన్ని చెరువులతో పాటు ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లో మరికొన్ని కలిపి.. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 104 చెరువులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 90కి పైగా చెరువులు పూర్తిస్థాయిలో నిండగా మిగిలిన వాటికీ నీరు చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి 15 రోజుల క్రితం నీరు విడుదల చేయగా రెండు మోటార్ల ద్వారా కాలువకు నిత్యం 270 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. మరో పది రోజుల్లో మిగిలిన చెరువులు కూడా నిండనున్నాయి. ఇవన్నీ నిండిన తర్వాత ప్రాజెక్టు మోటార్లు ఆఫ్ చేసి చెరువుల్లో నీళ్లు తగ్గుముఖం పడితే మరో మారు విడుదల చేసి చెరువులను నింపుతామని అధికారులు చెబుతున్నారు.

పంటలు పచ్చగా..

భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులకు సాగర్ జలాలు చేరుతుండగా వాటి కింద, కాలువల పరిధిలో పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఇప్పటికే కొందరు రైతులు నాట్లు వేయగా మరికొందరు వేస్తున్నారు. పత్తి చేలు సైతం కళకళలాడుతుండగా మిరప సాగును రైతులు ముమ్మరం చేశారు. అయితే ప్రాజెక్టు పరిధిలో అక్కడక్కడా కాలువల తవ్వకం నిలిచి సాగునీరు చేరడం లేదు. ఈ పనులను త్వరగా పూర్తిచేసి ఆ ప్రాంత రైతులకు కూడా సాగునీరు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సాగునీటికి ఢోకా లేదు

భక్త రామదాసు ప్రాజెక్టుకు పాలేరు రిజర్వాయర్ ద్వారా సాగర్ జలాలు పుష్కలంగా అందుతున్నాయి. ఈ ఏడాది ప్రాజెక్టు ద్వారా రెండు పంటలకు సాగునీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు. ఇప్పటికే 90 శాతం చెరువులు నింపాం. మిగిలినవి కొద్ది రోజుల్లో నింపుతాం. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. –రమేష్‌రెడ్డి, జలవనరుల శాఖ డీఈఈ

ఆనందంగా ఉంది

మా ఊరి చెరువుకు భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి నీరు చేరుతోంది. మా చెరువు నిండితే రెండు పంటలు పండుతాయి. బోరు, బావుల్లో నీళ్లు పెరుగుతాయి. ఈ యేడాది ముందస్తుగా నీళ్లు విడుదల చేయటం ఆనందంగా ఉంది.

– నెల్లూరి వీరభద్రం, రైతు, గట్టుసింగారం

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.32,335



జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 551 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,975, 220 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.13,360 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.